సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 26 । సెప్టెంబర్ । 2022

ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం



కూనవరం : టేకులబోరులో బతుకమ్మ ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణకు చెందిన ఆడపడుచులు తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. తొలిరోజు పూలతో బతుకమ్మ పండగ ప్రారంభమైంది. నువ్వులు, బియ్యపు పిండి, నూకలు నైవేద్యంగా పెట్టారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. రెండవ రోజు అటుకుల బతుకమ్మగా ఆరాధిస్తారు. సున్నపు పిండి, పప్పు బెల్లం, నప్పిడి కలిపి బతుకమ్మకు నైవేద్యంగా సమర్పిస్తారు. ఇలా తొమ్మిదిరోజుల పాటు బతుకమ్మను ఆరాధించి చివరి రోజు సద్దుల బతుకమ్మగా పండగను ముగిస్తారు.

వట్టిగెడ్డ రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు



రాజవొమ్మంగి : వట్టిగెడ్డ రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు చేరింది. ఎగువన కురిసిన వర్షాలకు రిజర్వాయర్‌లోకి వరదవెల్లువెత్తింది. కాగా ఆదివారం మధ్యాహ్నం మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది.

వికేంద్రీకరణతోనే సమగ్ర ప్రగతి

- విస్తృత అవకాశాల నగరం **విశాఖ**
- రాష్ట్రంలో అన్ని ప్రాంతాల **అభివృద్ధే** ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష
- అమరావతి పేరిట జరిగే **రైతుల** పాదయాత్రను అడ్డుకుంటాం
- వికేంద్రీకరణకు మద్దతుగా **గ్రామాల్లో** శాంతియుత ర్యాలీలు, నిర**సనలు**
- అరసవిల్లి నుంచి సింహాచలం దేవస్థానానికి పాదయాత్ర
- మేధావుల సదస్సులో రాజకీయ, సామాజిక, ఉద్యోగ, విద్యార్థి నాయకుల స్పష్టీకరణ

అంతా ఏకమై.. ఒకే నినాదమై..



వికేంద్రీకరణకు మద్దతుగా రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర మేధావులు..

సాక్షి, విశాఖపట్నం: పరిపాలన వికేంద్రీకరణకు మద్దతుగా ఉత్తరాంధ్ర మేధావులంతా ఒక్కటయ్యారు. రాజకీయ, సామాజిక, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి సంఘాలను ఏకీకృతం చేశారు. విశాఖను పరిపాలన రాజధానిగా ఏర్పాటు చేయాలన్న **డిమాండ్‌ను గట్టిగా వినిపించాలని నిర్ణయానికొచ్చారు. వెనుకబాటుకు గురైన ఉత్తరాంధ్ర ఇప్పటికైనా అభివృద్ధి పథంలోకి రావాలంటే.. మూడు రాజధానులు ఆవశ్యమని గట్టిగా నినదించారు. కుటిల** రాజకీయాల కోసం.. స్వార్థ ప్రయోజనాల కోసం అభివృద్ధి వికేంద్రీకరణను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్న వారికి గట్టిగా బుద్ధి చెప్పాలని తీర్మానించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి కుయుక్తులు పన్నుతున్న రాజకీయ పక్షాలకు గుణపాఠం చెప్పేలా.. భవిష్యత్ కార్యాచరణ కోసం కమిటీ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. మూడు రాజధానులతోనే రాష్ట్ర భవిష్యత్తు ముడిపడి ఉందన్న విషయాన్ని గ్రామ గ్రామాన ప్రజలకు వివరించి వారిలో చైతన్యం నింపేందుకు పెద్ద ఎత్తున శాంతియుత ర్యాలీలు నిర్వహించాలని సంకల్పించారు. అలాగే అమరావతి రైతుయాత్రను వ్యతిరేకిస్తూ.. అరసవిల్లి **నుంచి సింహాచలం దేవస్థానానికి పాదయాత్ర చేయాలని నిర్ణయించారు.**

దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన ఉత్తరాంధ్రకు ఇప్పటికైనా మేలు జరగాలంటే.. విశాఖ ఎగ్జిక్యూటివ్ రాజధానిని చేయాలని ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఆదివారం నిర్వహించిన ఉత్తరాంధ్ర మేధావుల సదస్సు నినదించింది. ఉత్తరాంధ్రకు చెందిన రాజకీయ, సామాజిక, ఉద్యోగ, విద్యార్థి, మేధావులందరూ ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు ఆవశ్యతను వ్యక్తపరిచారు. బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి హనుమంతు లజపతిరాయ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సు ప్రారంభానికి ముందుగా పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో విశాఖ రాజధానికి అడ్డుపడుతున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వారి కుట్రలను తిప్పికొట్టాలని, అమరావతి పేరుతో యాత్ర చేస్తున్న వారిని అడ్డుకోవాలని, పలు తీర్మానాలు, నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయానికి మద్దతు పలుకుతూ హర్షధ్వానాలతో తీర్మానం చేశారు. ఈ సదస్సులో ఉపముఖ్యమంత్రులు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, గొడ్డేటి మాధవి, బి.వి.సత్యవతి, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, పెట్ల ఉమాశంకర్ గణేష్, వాసుపల్లి గణేష్, తిప్పల నాగిరెడ్డి, చెట్టి పాల్గుణ, కె.భాగ్యలక్ష్మి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఉత్తరాంధ్రలోని వివిధ మేధావి వర్గాల ప్రతినిధులు, ఉద్యోగ, న్యాయవాది, వైద్యులు, అధ్యాపకుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

లాస్ ఏంజెల్స్ ఆఫ్ ఆంధ్ర.. విశాఖ



నౌకాదళానికి కేంద్ర బిందువు విశాఖ. విశాఖ–భీమిలి బీచ్‌రోడ్డు అతి సుందరమైన రహదారి. 1926లోనే సీఆర్‌రెడ్డి.. లాస్ ఏంజెల్స్ ఆఫ్ ఆంధ్ర అని విశాఖను కొనియాడారు. ఇక్కడ అభివృద్ధి అనేది రాష్ట్రమంతటికీ గొప్ప వరంగా భావించాలి.

– ఆచార్య చందు సుబ్బారావు, ప్రముఖ రచయిత

నేవీ, స్టీల్‌ప్లాంట్ కోసం ఇక్కడి రైతులు త్యాగం చేయలేదా?



వికేంద్రీకరణకు రాష్ట్ర ప్రజలందరి మద్దతు ఉంది. ఉత్తరాంధ్ర ప్రజల గుండెలపై అమరావతి రైతుల పేరుతో చేస్తున్న కవాతు గురించి మాట్లాడాల్సిన సమయం ఇది. లక్షలాది ఎకరాలను నేవీ, స్టీల్‌ప్లాంట్ కోసం ఇక్కడి రైతులు త్యాగం చేశారు. దీని గురించి ఆలోచించాలి. కేవలం 29 గ్రామాల కోసం రాష్ట్రాన్ని ఇబ్బందుల పాలు చేయాలని చూస్తున్నారు.

– కొయ్య ప్రసాదరెడ్డి, ఉత్తరాంధ్ర రక్షణ సమితి అధ్యక్షుడు

సీఎం జగన్‌తోనే సాధ్యం



విశాఖలో పెట్టిన పాలికేక.. రాష్ట్రం మొత్తానికి పాకి.. పరిపాలన వికేంద్రీకరణ జరిగి తీరుతుంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మాత్రమే ఇది సాధ్యమవుతుంది. ఇప్పటికే 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించి సుపరిపాలనకు శ్రీకారం చుట్టిన సీఎం.. అభివృద్ధి వికేంద్రీకరణ కోసం 3 రాజధానులు కచ్చితంగా ఏర్పాటు చేస్తారు. పరిపాలన వికేంద్రీకరణకు మద్దతు ఇస్తున్నాం.

– ప్రొఫెసర్ పాల్, ఏయూ హెచ్‌ఆర్‌డీ విభాగాధిపతి

అరసవల్లి నుంచి సింహాచలం వరకు పాదయాత్ర



అమరావతి నుంచి అరసవల్లి పాదయాత్రను మనం ఎదుర్కోవాలి. అమరావతి రైతుల పాదయాత్రకు వ్యతిరేకంగా అరసవల్లి నుంచి సింహాచలం వరకు శాంతియుతంగా పాదయాత్ర చేయాలి. ఓ పక్క పాదయాత్ర చేస్తూ.. ప్రతి గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలి. వుయ్ వాంట్ విశాఖ క్యాపిటల్.. వుయ్ వాంట్ వికేంద్రీకరణ అంటూ నినాదాలు చేయాలి. అప్పుడే స్తబ్దుగా ఉన్న ఉత్తరాంధ్ర చైతన్యవంతమవుతుంది.

–ప్రొఫెసర్ విజయ్‌కుమార్, ఏయూ

అభివృద్ధికి అడ్డుపడితే ఊరుకునేది లేదు



బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని విశాఖ వాసులు అక్కున చేర్చుకుంటారు. అలాంటి మా ప్రాంత అభివృద్ధికి అడ్డుపడితే ఊరుకునేది లేదు. అందుకోసం ఎందాకైనా ముందుకు వెళతాం. మా మౌనాన్ని అమాయకత్వంగా అనుకుంటే పొరపాటే. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న పరిపాలన వికేంద్రీకరణకు మద్దతు పలుకుతున్నాం.

– డాక్టర్ రవీంద్ర

ఉత్తర భారతీయుల మద్దతు విశాఖకే..



దేశ వ్యాప్తంగా విభిన్న కులాలు, మతాలు వారు విశాఖకు వచ్చి జీవిస్తున్నారు. ఎక్కువగా నార్త్ ఇండియన్స్ విశాఖలో వ్యాపారాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయానికి విశాఖ వచ్చి జీవిస్తున్న ఉత్తర భారతీయులందరి తరపున మద్దతు తెలుపుతున్నాం.

– ఆనంద్ సింగ్, గురుద్వార్ ప్రెసిడెంట్

వెన్నుపోటుదారుల్ని క్షమించకూడదు



మేధావులు, ప్రముఖులతో చర్చించి.. శాస్త్రీయ ఆధారాలతో రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారు. ఏయూ అధ్యాపకులు, ఉద్యోగులు జేఏసీగా ఏర్పడి.. మూడు రాజధానులకు మద్దతుగా పోరాటాలు నిర్వహిస్తున్నాం. జలరవాణా, రహదారి, విమానయానం.. ఇలా అన్ని రవాణా సౌకర్యాలు, ఐటీ హిల్స్.. నౌకాదళం.. ఇలా అన్నింటిలోనూ విశాఖ అగ్రగామిగా ఉంది. ఉత్తరాంధ్ర వలసలు ఆగాలంటే, నిరుద్యోగ యువతకు ఉపాధి కావాలంటే రాజధాని అవసరం. ఇక్కడ ప్రభుత్వ భూముల్లో తక్కువ డబ్బులతో రాజధానిని నిర్మించవచ్చు. విశాఖ అభివృద్ధిని అడ్డుకోవడానికే కోట్లాది ఆస్తులున్న అమరావతి రైతులు పాదయాత్ర చేస్తున్నారు.

– షారోన్‌రాజ్, ఏయూ ప్రొఫెసర్

మళ్లీ ఆ తప్పు చేయొద్దు



అసెంబ్లీలో పరిపాలన వికేంద్రీకరణపై ప్రకటన వెలువడిన వెంటనే.. మద్దతుగా ర్యాలీలు నిర్వహించాం. గుంటూరు, విజయవాడ ఉద్యోగులు కూడా ఇందుకు మద్దతుగా ఉన్నారు. హైదరాబాద్ రాజధానిగా ఉన్నప్పుడు.. తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతున్నప్పుడు.. వేల కోట్లతో మెట్రోను కేటాయించినా ఏపీ ప్రజలందరూ మద్దతిచ్చారు. ఇప్పుడు మళ్లీ అదే తప్పు చేస్తే.. ఒకే ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. మిగిలిన ప్రాంతాల ప్రజలు ఉపాధి అవకాశాలు కోల్పోతారు.

–ఈశ్వరరావు, ఏపీ ఎన్జీవోల సంఘం

చరిత్రహీనులుగా మిగిలిపోవద్దు



విభజన గాయాలు ఇంకా మానలేదు. ఉనికి కోసం కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న రియల్ ఎస్టేట్ యాత్ర అది. ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలను నీరుగార్చేందుకు చేస్తున్న అమరావతి రైతుల యాత్రను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. తుని దగ్గర నుంచే వెనక్కి తిప్పి పంపించేందుకు కార్యాచరణ రూపొందించాలి. సీఎం నిర్ణయాన్ని స్వాగతించని వారు.. చరిత్రహీనులుగా మిగిలిపోతారు.

– మంత్రి రాజశేఖర్, ట్రేడ్ యూనియన్ లీడర్

వికేంద్రీకరణతోనే అభివృద్ధి



పరిపాలన సౌలభ్యం కోసం వికేంద్రీకరణ అవసరం. దీని వల్ల రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. గతంలో ఏ ఒక్క ప్రభుత్వమైనా ఇలాంటి నిర్ణయం తీసుకుని ఉంటే.. విభజన జరిగిన తర్వాత ఇంత ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేది కాదు. విశాఖ రాజధానిగా మారితే.. అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తుంది.

– నరసింగరావు, బార్ కౌన్సిల్ సభ్యుడు

కేంద్రం కూడా ఆదుకోవడం లేదు



రాష్ట్రంలోని విద్యావంతులందరూ మూడు రాజధానులకు మద్దతు పలుకుతున్నారు. ప్రస్తుతం కేంద్రం కూడా రాష్ట్రాన్ని ఆదుకోవడం లేదు. విశాఖ పరిపాలన రాజధానిగా మారితే రానున్న కాలంలో మరిన్ని పరిశ్రమలు విశాఖకు తరలివస్తాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

– డాక్టర్ ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయుల సంఘం నాయకుడు

ఆదివాసీ వేదిక.. మళ్లీ పెళ్లి వేడుక

- గిరి గ్రామదర్శినికి రాష్ట్రస్థాయి గుర్తింపు
- ఉత్తమ పర్యాటక అవార్డుకు ఎంపిక

ప్రకృతి అందాలకు నెలవైన అరకులోయలో 'గిరి గ్రామదర్శిని' ఆదివాసీ జీవన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తోంది. గిరిజన సంప్రదాయ వస్త్రధారణలో పర్యాటకులకు వివాహ వేడుక అవకాశాన్ని కల్పిస్తోంది. గిరిజన సంప్రదాయంలో వారి ఆచార వ్యవహారాలతో ఆదివాసీ పూజారుల మంత్రాలతో ఇక్కడ మళ్లీ పెళ్లి చేసుకుని ఆనందపరవశులు కావచ్చు. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన ఆచార, సంప్రదాయాల ప్రకారం వివాహం చేస్తున్నారు. కొత్తగా వివాహం చేసుకునే వారితో పాటు మళ్లీ వివాహ తతంగాన్ని ఆస్వాదించాలనుకునే దంపతులకు స్వాగతం పలుకుతున్నారు. ఇప్పుడు ఈ గిరి గ్రామదర్శిని 2022 రాష్ట్ర వార్షిక ఉత్తమ పర్యాటక అవార్డుకు ఎంపికైంది.



గిరిజన మహిళల వస్త్రధారణతో అరకు ఎంపీ మాధవి, ఇతర మహిళా ఎంపీలు



పర్యాటక అవార్డు గెలుచుకున్న గిరి గ్రామదర్శిని

సాక్షి,పాడేరు: పర్యాటక రంగంలో అల్లూరి సీతారామరాజు జిల్లా సత్తా చూపుతోంది. ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు పాడేరు ఐటీడీఏ చేస్తున్న కృషి ఫలితాలిస్తోంది. అరకులోయ ప్రాంతంలోని పెదలబుడు పంచాయతీ గంజాయిగుడ గ్రామం వద్ద పాడేరు ఐటీడీఏ ఎకో టూరిజం ప్రాజెక్టులో భాగంగా గిరిజనులను భాగస్వామ్యం చేస్తూ గిరి గ్రామదర్శిని పర్యాటక ప్రాంతాన్ని అద్భుతంగా నిర్మించింది. ఈ గిరి గ్రామదర్శినిని 2022 రాష్ట్ర వార్షిక ఉత్తమ పర్యాటక అవార్డుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆదివారం సాయంత్రం పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణకు టూరిజం శాఖ నుంచి సమాచారం అందింది. తిరుపతిలో జరిగే ప్రపంచ పర్యాటక దినోత్సవంలో ఈనెల 27న ఈ అవార్డును రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా ఐటీడీఏ అధికారులు స్వీకరించనున్నారు.

గిరిజన ఆచార,సాంప్రదాయాల ప్రతిబింబం

గంజాయిగుడలో విశాలమైన స్థలంలో నిర్మించిన గిరి గ్రామదర్శిని గిరిజన ఆచార, సంప్రదాయాలకు ప్రతిబింబంగా దర్శనమిస్తోంది. ఇక్కడ నిర్మించిన కాటేజీలు, గడ్డితో నిర్మించిన గుడిసెలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. గిరిజనులు పూర్వం నుంచి వినియోగిస్తున్న వ్యవసాయ, ఇతర పనిముట్లు ఇక్కడ ప్రదర్శనలో ఉంచారు. వ్యవసాయం, నిత్యావసరాల్లో వినియోగించే సామగ్రి, గిరిజనుల కళాకృతులు చూపరులను ఎంతో ఆకర్షిస్తున్నాయి. ఈ గిరి గ్రామదర్శినిలో వివాహాల తంతు మరింత ఆకర్షణీయంగా మారింది. గిరి గ్రామదర్శిని పర్యాటక ప్రాంతాన్ని సందర్శించిన వారిని ఇక్కడ గిరిజన ఆచార, సాంప్రదాయాలు ఆకట్టుకుంటున్నాయి.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి : ఐటీడీఏ పీవో

పాడేరు ఐటీడీఏ పరిధిలోని అన్ని సందర్శనీయ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ విలేకరులకు తెలిపారు. పెదబయలు మండలం ఎంగ్రిక్‌పర్వతం, ముంచంగిపుట్టు మండలం సుజనకోట, వంజంగి మేఘాల కొండ, చింతపల్లి మండలం తాజంగి, హుకుంపేట మండలం ఉప్పచెట్లు, అనంతగిరి మండలం పెదబయలు వాటర్‌ఫాల్స్, హుకుంపేట మండలంలో మత్స్యగుండం పర్యాటక ప్రాంతాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అరకులోయ ప్రాంతంలోని ఐటీడీఏ గిరి గ్రామదర్శిని ఒక అద్భుతమని, గిరిజన ఆచార, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ఐటీడీఏ నిర్మించిందని, ఈ ప్రాంతానికి ఉత్తమ పర్యాటక అవార్డు రావడం సంతోషంగా ఉందని పీవో తెలిపారు.



వివాహం చేసుకుంటున్న సుప్రీంకోర్టు పధాన న్యాయమూర్తి లలిత్ దంపతులు (ఫైల్)



వివాహం చేసుకుంటున్న కాంతిలాల్ దండే దంపతులు (ఫైల్)

గిరిజన సంప్రదాయంలో వివాహాలు

గిరి గ్రామదర్శినిని సందర్శించిన వారంతా గిరిజన సంప్రదాయంలో మళ్లీ వివాహాలు చేసుకునే తంతు ప్రధాన ఘట్టంగా మారింది. గిరిజనులు పూర్వం ధరించే వస్త్రాలతో వివాహాలు జరుపుకోవడం, గిరిజన పూజారులు మంత్రాలు చదవడం, ఇతర ఆచారాలు పాటించడం ఈ వివాహ వేడుకలో ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. గిరి గ్రామదర్శిని ప్రారంభంలో అప్పటి ఐటీడీఏ పీవో డి.కె.బాలాజీ, సబ్ కలెక్టర్ శివశంకర్‌లు తమ భార్యలను మళ్లీ గిరిజన సంప్రదాయంలో వివాహాలు చేసుకున్నారు. తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉమేష్ ఉదయ్ లలిత్ దంపతులు వివాహం చేసుకోవడం ద్వారా గిరి గ్రామదర్శిని దేశవ్యాప్త ప్రాచుర్యం పొందింది. ఆ తర్వాత గిరిజన సంక్షేమ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండేతో పాటు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు, ప్రస్తుత ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ కూడా గిరిజన సంప్రదాయంలో మళ్లీ వివాహం చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని పలు కమిటీలు కూడా గిరి గ్రామదర్శినిని సందర్శించాయి.

ఈ-క్రాప్ నమోదు.. శతశాతానికి చేరువగా..

- జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం : 3,01,720.87 ఎకరాలు
- ఈ ఏడాది సాగు విస్తీర్ణం : 2,37,454 ఎకరాలు
- ఈ క్రాప్ జరిగినది : 2,31,030 ఎకరాలు
- రేపటితో గడువు పూర్తి



గిరిజన మహిళా రైతుకు ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

జిల్లాలో శతశాతం ఈ-క్రాప్ నమోదుకు అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి. ఇప్పటికే 97.29 శాతం పూర్తయింది. రెండు రోజులు గడువు ఉండడంతో పూర్తిస్థాయిలో లక్ష్యాన్ని చేరుకుంటామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

ముంచంగిపుట్టు: రైతులకు పెట్టుబడి సాయం ఎంత ముఖ్యమో, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన వారికి పరిహారం సైతం అంతే అవసరం. నష్టపోయే అన్నదాతలందరికీ పరిహారం అందాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ పంట నమోదును వ్యవసాయ, ఉద్యానవనశాఖల అధికారులతో చేయిస్తోంది.ఈ పంట నమోదుతో రైతులు పండించే పంటలకు ఆర్థిక భరోసా సైతం లభిస్తుంది. ముఖ్యంగా ఏజెన్సీలో రైతులకు చాలా వరకు మేలు జరగనుంది. రైతులు పండించే అన్ని రకాల పంటల వివరాలు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో వ్యవసాయ శాఖ ఎంపీఈవోలు, ఉద్యానవన శాఖ సిబ్బంది ఈ క్రాప్ నమోదును పంట పొలాల్లో ముమ్మరంగా చేశారు. జిల్లాలో 22 మండలాల్లో 2,978 గ్రామాల్లో గిరిజన రైతులు సాగు చేసిన వరి, వేరుశనగ,రాగులు,కూరగాయలు తదితర పంటలకు ఈ క్రాప్ నమోదు చేపట్టారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 3,01,720.87 ఎకరాలు కాగా, ఈ ఏడాది 2,37,454 ఎకరాల్లో వివిధ పంటలు పండించారు. ఇప్పటి వరకు 2,31,030 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు పూర్తయింది. 97.29 శాతం నమోదు పూర్తయినట్టు అధికారులు తెలిపారు.ఈ నెల 27వ తేదీతో ఈ గడువు ముగుస్తుంది. మిగిలిన రైతులు వేగంగా నమోదు చేసుకోవాలని,ఈ క్రాప్‌తో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు.

ప్రయోజనాలు..

- ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటకు నష్టం కలిగితే పరిహారం నేరుగా రైతుకు అందుతుంది.
- దళారుల చేతికి భీమా పరిహారం అందకుండా, ప్రభుత్వమే పూర్తి స్థాయిలో రైతులకు సొమ్ము చెల్లిస్తుంది.
- పంట మార్పిడికి వీలుంటుంది.పంటల వివరాల ఆధారంగా ఉత్పత్తుల లభ్యతపై స్పష్టత వస్తుంది.
- పంట నష్టపోయినప్పుడు రైతు ఎంత మేరకు పంట సాగు చేశారన్న వివరాలు తెలుస్తాయి.
- దిగుబడుల అంచనాకు ఇది సరైన విధానం.రైతు భరోసా కేంద్రాల్లో ఉండే గ్రామాల్లో రైతులకు ఎరువులు,పురుగుల మందులు,ఎంతమేరకు అవసరమో వ్యవసాయ శాఖ అధికారులకు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

నమోదుకు రోజువారీ లక్ష్యాలు



జిల్లాలో ఈ ఏడాది 2,978 గ్రామాల్లో 2,37,454 ఎకరాలకు ఈక్రాప్ నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఇప్పటికీ 2,31,030 ఎకరాల్లో నమోదు పూర్తి అయింది. రోజు వారీ లక్ష్యాలను వ్యవసాయ సిబ్బందికి నిర్ణయించి, రైతులకు ప్రయోజనాలు వివరిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాం. పంటలు నష్టపోతే ఎవరి చుట్టూ తిరగకుండా ప్రభుత్వమే పరిహారం సకాలంలో రైతులకు చెల్లించడం జరుగుతుంది.ప్రతి రైతు ఈ పంట నమోదును సద్వినియోగం చేసుకోవాలి.

–ఎస్.బి.ఎస్.నందు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

ఈ పంట నమోదుతో మేలు



వ్యవసాయ శాఖ అధికారులు మా పొలాల వద్దకు వచ్చి ఈ పంటను నమోదు చేశారు. ఈ పంట నమోదుతో ఎంతో మేలు జరుగుతుంది.ప్రభుత్వమే భీమా సొమ్ము చెల్లించడం ఆనందంగా ఉంది.పంట నష్టం జరిగితే ప్రభుత్వం పరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాడం శుభపరిణామం .ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎప్పుడూ రైతుల శ్రేయస్సు కోసం పని చేస్తారు.

–బి.లక్ష్మణ్, గిరిజన రైతు,గొడుగులపుట్టు గ్రామం, ముంచంగిపుట్టు మండలం

మండలాల వారీగా వివరాలు..

మండలం	సాగు విస్తీర్ణం	నమోదుపూర్తి	చేయించుకున్న రైతులు
అనంతగిరి	12,854.89	10,989.26	3,830
అరకువేలి	24,275	18,133.03	5,510
ఎటపాక	11,231.10	4,971.61	2,018
కూనవరం	4,468	989.01	509
కొయ్యూరు	19,328.50	14,493.17	4,831
గంగవరం	9,514.28	8,187.78	2,574
చింతపల్లి	16,960	13,771.25	4,922
చింతూరు	10,547	8,304.15	2,699
జి.కె.వీధి	18,158	6,915.75	3,555
జి.మాడుగుల	14,790	14,439.06	5132
డుంబ్రిగుడ	20,909	17,716.12	4,904
దేవీపట్నం	6,338.73	4,404.89	1,290
పాడేరు	20,754.29	14,089.90	5,334
పెదబయలు	16,839.95	16,041.17	5,795
మారేడుమిల్లి	7,063	6,067.96	2,037
ముంచంగిపుట్టు	17,730.90	16,053.40	4,951
రాజవొమ్మంగి	12,297.48	11,359.43	4,409
రంపచోడవరం	9,954	8,558.08	3,171
వి.ఆర్.పురం	4,894	2,295.64	847
వై.రామవరం	8,183	6,763.97	2,224
హుకుంపేట	22,841.60	15,514.62	6,778
అడ్డతీగల	11,788	10,971	3,481

కార్గో @ 24/7

- కొత్తగా విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌లో కౌంటర్
- త్వరలో విజయనగరం, శ్రీకాకుళం, మద్దిలపాలెంలలోనూ ఏర్పాటు
- రోజురోజుకు సరకు రవాణాకు పెరుగుతున్న ఆదరణ
- ఆర్టీసీ పార్సిల్ సేవలు మరింత విస్తరణ
- ఉత్తరాంధ్ర సహా ఒడిశాలోనూ ఏటీబీ కౌంటర్ల పెంపు



విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌లో కార్గో కార్యాలయం, బుకింగ్ కౌంటర్లు

సాక్షి, విశాఖపట్నం: సరకు రవాణాలో సత్ఫలితాలు పొందుతున్న ఆర్టీసీ కార్గో విభాగం తన సేవలను మరింత విస్తరిస్తోంది. వినియోగదారునికి చేరువవుతూ ఆదాయాన్ని పెంచుకోవడంపై దృష్టి సారిస్తోంది. ఇప్పటివరకు నిర్ణీత సమయంలోనే కార్గో బుకింగ్ కౌంటర్లు/పాయింట్లను తెరచి ఉంచుతోంది. తాజాగా విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌లో 24 గంటలూ పనిచేసే కార్గో బుకింగ్ కౌంటర్‌ను ప్రారంభించింది. ఇన్నాళ్లు ఈ కౌంటర్‌ను ఉదయం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు రెండు షిఫ్టుల్లో నడిపేవారు. దీనిని మూడు షిఫ్టులకు పెంచుతూ 24/7 బుకింగ్‌కు వీలు కల్పించారు. ఈ సేవలను ఇప్పుడు రాత్రి విధులు ముగించుకున్న వారు, దుకాణాలు మూసివేసి ఇంటికి వెళ్లేవారు... ఆటోమొబైల్ విడిభాగాలు, విద్యుత్, దంత వైద్య పరికరాలు, వస్త్రాలు, దుస్తులు వంటివి రవాణాకు వినియోగించుకుంటున్నారు. అప్పటివరకు ఈ బుకింగ్ కౌంటర్‌కు రోజుకు సగటున 1,400 బుకింగ్‌ల ద్వారా రూ.1.45 లక్షల ఆదాయం వచ్చేది. 24/7 సేవలు అందుబాటులోకి రావడంతో బుకింగ్‌లు 1,500కు చేరి ఆదాయం రూ.1.55 లక్షలకు పెరిగింది. అంటే రోజుకు రూ.10 వేల రాబడి అదనంగా వస్తోంది. ఇలా మంచి ఆదరణ లభిస్తుండడంతో త్వరలో మద్దిలపాలెం, విజయనగరం, శ్రీకాకుళం పట్టణాల్లోనూ 24/7 కౌంటర్లను ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆర్టీసీ విజయనగరం జోన్ కార్గో రవాణాలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంది. మరోవైపు ప్రస్తుతం ఆర్టీసీ విజయనగరం కార్గో జోన్ పరిధిలో 61 ఏటీబీ కౌంటర్లున్నాయి. త్వరలో ఉత్తరాంధ్ర సహా పొరుగున ఉన్న ఒడిశాలోనూ ఏటీబీ (అథరైజ్డ్ టికెట్ బుకింగ్) ఏజెంట్ల నియామకం చేపట్టనున్నారు. ఇలా కొత్తగా చింతపల్లి, సీలేరు, అడ్డురోడ్డు, మాకవరపాలెం, వంగర, తెర్లాం, శ్రీకాకుళం పాత బస్టాండు, ఒడిశాలోని రాయగడ, గుణుపూర్, బరంపురం (బ్రహ్మపుర)లలోనూ వీరిని నియమించనున్నారు. అధీకృత ఏజెన్సీ కోసం రూరల్‌లో రూ.వెయ్యి, అర్బన్‌లో రూ.5 వేల చొప్పున డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. వీరికి బుకింగ్ చార్జీలో 15 శాతం కమీషన్‌గా చెల్లిస్తారు. మరోవైపు ఇటీవల ఇల్లు మారే వారి సామగ్రిని కూడా రవాణా చేసేందుకు ఆర్టీసీ కార్గో విభాగం ముందుకొచ్చింది. తమకున్న కార్గో కంటైనర్లను ఇందుకు వినియోగిస్తోంది. ఈ జోన్‌లో పార్సిల్ రవాణా ద్వారా రోజుకు రూ.5 లక్షలు లభిస్తుండగా దీన్ని రూ.6 లక్షలకు పెంచాలని యోచిస్తున్నారు.

48 గంటల్లో డెలివరీ సౌలభ్యం

ఇప్పటికే ఆర్టీసీ కార్గో బుకింగ్‌ల ద్వారా సరకు రవాణాతో పాటు కొరియర్ సేవలను అందిస్తోంది. పార్సిల్ కౌంటర్ నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో 50 కిలోల బరువు వరకు సరకును వినియోగదారుడు కోరుకున్న చిరునామాకు డోర్ డెలివరీ చేస్తున్నారు. ఈ జోన్‌లో ఆర్టీసీకి 42 సరకు రవాణా కార్గో కంటైనర్లు (లారీలు) అందుబాటులో ఉన్నాయి. విశాఖ నుంచి ఎక్కువగా సిమెంట్, హార్డ్‌వేర్, గృహోపకరణ సరకులు, హార్మనీ ఆటా, బిర్లా వైట్ సిమెంట్, జేకే వైట్ సిమెంట్, దుస్తులు, ఫ్లిప్‌కార్ట్ సరకులు, ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి మందులు, నూకలు వంటివి వివిధ ప్రాంతాలకు బుక్ అవుతున్నాయి. బుక్ చేసిన సరకును ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లోనూ 48 గంటల్లోనే డెలివరీ చేస్తున్నారు. ఇది వినియోగదార్లకు ఎంతగానో సౌలభ్యంగా ఉండడం వల్ల ఆర్టీసీ కార్గో బుకింగ్‌లు పెరగడానికి దోహదపడుతోంది.

సేవలు మరింత చేరువగా..



ఆర్టీసీ కార్గో రవాణాపై జనంలో ఆదరణ ఉంది. ఆర్టీసీ కంటైనర్లలో రవాణా చేయడం వల్ల సరకు దెబ్బతినదని, నాణ్యత చెడిపోదని, బాధ్యతగా అప్పగిస్తారని ప్రజల్లో నమ్మకం పెరిగింది. కార్గో సేవలు విస్తృతం చేస్తూ వినియోగదారులకు మరింత చేరువవుతాం. కొత్తగా ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశాలోను మరిన్ని కార్గో బుకింగ్ కౌంటర్లను అందుబాటులోకి తెస్తున్నాం. మరికొన్నిచోట్ల 24/7 బుకింగ్ కౌంటర్లను విస్తరిస్తున్నాం. ఆసక్తి ఉన్న వారికి ఏటీబీ ఏజెంట్లుగా అవకాశాలు కల్పిస్తున్నాం. నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది. ఆర్టీసీకి ఆదాయమూ పెరుగుతుంది. –కణితి వెంకట్రావు, డీసీఎం, విజయనగరం జోన్

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి



నాబార్డ్ సీజీఎం ఉదయ్‌భాస్కర్‌ను కలిసిన వికాస్ సంస్థ ప్రతినిధులు

అరకులోయ రూరల్: రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్టు నాబార్డు సీజీఎం ఉదయ్‌భాస్కర్ అన్నారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ పర్యటనలో భాగంగా ఆయన మండల కేంద్రంలోని ఏపీ టూరిజం హరిత రిసార్ట్‌లో కొంతసేపు గడిపారు. ఈ సందర్భంగా వికాస్ సంస్థ ప్రతినిధులు వెంకట్ తదితరులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. మాతోట కార్యక్రమం ద్వారా రైతులకు తోడ్పాటునందించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి రైతుల ఆర్థికాభివృద్ధి కోసం అని రకాలుగా ప్రోత్సాహం అందిస్తామన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో ఉన్న 11 మండలాల్లో నాబార్డ్ టీడీఎఫ్ పథకం ద్వారా గతంలో 11,000 ఎకరాల్లో మాతోట పెంపకం చేపట్టి మామిడి, సపోట, జామి,అరటి, జీడిమామిడి, ఉసిరి, నేరేడు, సీతాఫలం, టేకు, ఎర్రచందనం తదితర మొక్కలను అందజేసినట్టు చెప్పారు. మాతోట ద్వారా రైతులకు మరింత ప్రోత్సాహం అందజేస్తామన్నారు.

ఐదుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో పలు ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. వీరితోపాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు ఆయన వివరించారు.

డిగ్రీ కళాశాలల్లో సమస్యలపై మంత్రికి వినతి



విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, చింతపల్లి డిగ్రీ కళాశాలలో నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలు వినతిపత్రం అందజేసారు. విశాఖపట్నంలో మంత్రిని వారు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల, చింతపల్లి డిగ్రీ కాలేజీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని మంత్రిని కోరారు. అరకులోయ కాలేజీలో అదనపు తరగతి గదులతో పాటు ప్రహరీ, చింతపల్లి కళాశాలలో ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుందని వారు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చారని ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిలు విలేకరులకు తెలిపారు.

గిరిజన సంప్రదాయాలు చాలా ఇష్టం

నంద్యాల ఎంపీ బ్రహ్మానందరెడ్డి



పంట పొలంలో గిరిజనులతో ఎంపీ

అనంతగిరి: గిరిజనులన్నా, గిరిజన సంప్రదాయలన్నా తనకు చాలా ఇష్టమని, నంద్యాల ఎంపీ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మండలంలోని ఎస్ ఆర్ పురం పంచాయతీ కోటపర్తిని ఆదివారం ఆయన సందర్శించి, గ్రామస్తులతో మమేకమయ్యారు. గిరిజన ఆచారవ్యవహారాల గురించి అడిగితెలుసుకున్నారు. గిరిజనులతో కలిసి దుక్కి దున్నారు. స్థానికంగా దొరికే పందుంపుల్లలతో దంతదావనం చేశారు. అనంతరం ఎంపీ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. ఏజెన్సీలో సాగుచేసే సీతాఫలాలు మంచి రుచిగా ఉంటాయని, వీటికి మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు, ఇతర ప్రాంతాలకు ఎగుమతికి కృషిచేస్తానని చెప్పారు. ఒడిశా నాబార్డు సీజీఎమ్ ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

27న ఆర్‌ఎంపీల మహాసభ



సమావేశంలో పాల్గొన్న ఆర్‌ఎంపీలు

చోడవరం రూరల్: ఈ నెల 27న విశాఖ సిటీ పరిధిలోని సాయి రిసార్ట్స్‌లో జరగనున్న విశాఖ ఆర్ ఎంపీల మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం చోడవరం ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం వారు మాట్లాడుతూ సంఘ వ్యవస్థాపకుడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగం జోషి నేతృత్వంలో జరిగే మహాసభకు పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని గ్రామగ్రామాన తిరిగి గ్రామీణ వైద్యులందరినీ సంఘటితం చేసి మహాసభకు వారంతా హాజరయ్యేలా కృషి చేశామన్నారు. సంఘ అధ్యక్షుడు ఎస్.రాజు, వర్కింగ్ ప్రెసిడింట్ డి.అమిత్‌కుమార్, కార్యదర్శి ఏవీ శ్రీకాంత్, ఆర్.ఆదినారాయణ, ఐ.కొండలరావు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిరిజన బాలుడికి తీవ్ర గాయాలు



బాలుడిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

హుకుంపేట: మండలంలోని గడుగుపల్లి గ్రామంలో జాతీయ రహదారి రోడ్డు పనులకు సంబంధించి సిమెంట్ దిమ్మ గిరిజన బాలుడి కాలుపై పడడంతో తీవ్ర గాయలయ్యాయి. గ్రామానికి చెందిన కొర్రా సంతోష్(12) రోడ్డు పనులు జరుగుతున్న ప్రదేశంలో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా సిమెంట్ దిమ్మ బాలుడి కాలుపై పడడంతో ఎడమకాలు గాయమై విరిగిపోయింది. హుటాహుటిన బాలుడిని 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు కల్పించారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

అనకాపల్లి టౌన్: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేదని ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. కుంచంగి గ్రామానికి చెందిన పల్లెల చందు (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేదని గత నెల 30న మనస్తాపంతో పురుగు మందు సేవించాడు. తీవ్ర అస్వస్థతకు గురైన చందును విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

ఏవోబీలో బలగాల ఏరియా డామినేషన్



సరిహద్దులో ఏరియా డామినేషన్ నిర్వహిస్తున్న సీఐ అశోక్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ బలగాలు

సీలేరు: ఆంధ్రా,ఒడిశా సరిహద్దు సీలేరు అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలు ఆదివారం ఏరియా డామినేషన్ నిర్వహించాయి. మావోయిస్టు పార్టీ వార్షికోత్సవం నేపథ్యంలో బలగాలు అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. జి.కె.వీధి సీఐ అశోక్‌కుమార్ నేతృత్వంలో సరిహద్దు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఏరియా డామినేషన్ చేపట్టారు. సరిహద్దు దాటుతున్న వాహనాలను తనిఖీ చేశారు.

పర్యాటక ప్రాంతాలు కళకళ



వంజంగి హిల్స్‌లో మంచు అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

సాక్షి, పాడేరు: జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. ఇక్కడ ప్రకృతి అందాలను వీక్షించి పర్యాటకులు పరవశించారు. అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జి.కె.వీధి, కొయ్యూరుతో పాటు రంపచోడవరం పరిధిలోని మారెడుమిల్లి, మారెడుమిల్లి నుంచి చింతూరు పోయే ఘాట్ ప్రాంతాల్లోని పర్యాటక ప్రాంతాలను సందర్శికులు సందర్శించారు. జలపాతాల వద్ద పర్యాటకులు సందడి చేశారు. విద్యార్థులకు దసరా సెలవులు కావడంతో కుటుంబసమేతంగా పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. మంచు, మేఘాల కొండగా విశ్వవ్యాప్తి పొందిన పాడేరు సమీపంలోని వంజంగి హిల్స్ వద్ద కూడా పర్యాటకులు తాకిడి అధికమైంది. ఇక్కడ సూర్యోదయం, మంచు అందాలు వీక్షించి పర్యాటకులు సంతోషం వ్యక్తం చేశారు. పాడేరు, లంబసింగి, అనంతగిరి, దారకొండ ఘాట్ ప్రాంతాలతో పాటు సీలేరు, మోతుగూడెం, జోలాపుట్టు, మాచ్‌ఖండ్ సమీపంలోని డుడుమ జలాశయాలను పర్యాటకులు సందర్శించారు. మాచ్‌ఖండ్, సీలేరు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పర్యాటకులు వీక్షించారు. టూరిజం శాఖకు చెందిన అనంతగిరి, తైడా, అరకులోయ మయూరి, హరిత, లంబసింగి రిసార్టులు పర్యాటకులతో నిండి ఉన్నాయి. పాడేరు, అరకులోయ, లంబసింగిలోని ప్రైవేటు రిసార్టులు, లాడ్జిలకు కూడా పర్యాటకుల ఆదరణ నెలకొంది.



బొర్రా గుహలు సందర్శించిన పర్యాటకులు

సందర్శిత ప్రాంతాలకు పర్యాటకులు తాకిడి

అనంతగిరి: మండలంలోని ప్రముఖ సందర్శిత ప్రాంతాలకు పర్యాటకులు పోటెత్తారు. ఇక్కడి బొర్రా గుహలకు ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. గతవారంతో పోలిస్తే ఈ ఆదివారం బొర్రాగుహలను 1700 మంది పర్యాటకులు తిలకించగా, సుమారు రూ.1.10లక్ష ఆదాయం వచ్చినట్టు తెలిసింది. కటికి, తాటిగుడ, సరియా, డముకు వ్యూపాయింట్ తదితర సందర్శిత ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడాయి.

గంజాయి తరలిస్తున్న ఏడుగురి అరెస్టు



పోలీసులకు పట్టుబడిన గంజాయి నిందితులు

మోతుగూడెం: మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధి గొందిగూడెం జంక్షన్ వద్ద ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో గంజాయి తరలిస్తూ ఏడుగురు పట్టుబడ్డారని ఎస్ఐ అప్పలనాయుడు తెలిపారు. సుకుమామిడి నుంచి తెలంగాణలో కామారెడ్డి ప్రాంతానికి కారులో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామని ఆయన వివరించారు. వారి నుంచి ఏడు బ్యాగుల్లో 175 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఏడుగురును అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో ఏఎస్ఐ సత్తిబాబు, కృష్ణ పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణపై అవగాహన



తపస్వికొండలోని అటవీశాఖ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న రేంజ్ అధికారి లలితకుమారి

అడ్డతీగల: సహజసిద్ధమైన అడవుల పరిరక్షణపై క్షేత్రస్థాయి సిబ్బందికి సంపూర్ణ అవగాహన అవసరమని అడ్డతీగల రేంజ్ అధికారి డి.లలితకుమారి అన్నారు. రాయలసీమ ప్రాంతంలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న 24 మంది ఏపీ ఫారెస్ట్ అకాడమీ ద్వారా అడ్డతీగల అటవీక్షేత్ర సందర్శనకు వచ్చినట్టు ఆమె చెప్పారు. వీరు 15 రోజుల పాటు ఇక్కడ శిక్షణ పొందుతారని తెలిపారు. వీరిలో ఫారెస్ట్ బీటు అధికార్లు,సెక్షన్ అధికార్లు ఉన్నారన్నారు. తపస్వికొండ రక్షిత అటవీ ప్రాంతంలో సహజసిద్ధమైన అడవులను ఆదివారం వీరు సందర్శించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా వీరికి పలు అంశాలపై అవగాహన కల్పించినట్టు ఆమె తెలిపారు. సమర్థంగా విధులు నిర్వహించేందుకు శాఖాపరంగా ఈ శిక్షణ అత్యవసరమని రేంజ్ అధికారి లలితకుమారి చెప్పారు.

నిబద్ధతతో పనిచేసే వారికి గుర్తింపు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు సన్మానం



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర దంపతులను సన్మానిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి, చిత్రంలో ఎంపీలు మాధవి, సత్యవతి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి

మహారాణిపేట (విశాఖ దక్షిణ): పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ పాలకవర్గం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ జె.సుభద్ర దంపతులను ఉప ముఖ్యమంత్రి, ఎంపీలు సత్యవతి, మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి ఘనంగా సన్మానించారు. ముత్యాలనాయుడు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతం నుంచి జె.సుభద్రకు ఎంతో గుర్తింపు ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సుభద్రకు చెందిన గిరిజన తెగను ఇప్పటి వరకు ఏ పార్టీ పట్టించుకోలేదని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ కులాన్ని గుర్తించి ఉన్నత పదవి ఇచ్చారని అన్నారు. చైర్‌పర్సన్ సుభద్ర అనతి కాలంలోనే మంచి పట్టు సాధించి, జిల్లా పరిషత్‌ను ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. పార్టీలో బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ ఏడాది కాలంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టామన్నారు. తనకు అన్ని విధాలుగా సహకారం అందించిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు, ఎమ్మెల్యేలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీలు బి.వి.సత్యవతి, జి.మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫోక్ డ్యాన్స్‌లో చింతపల్లి ఏకలవ్యకు ప్రథమ బహుమతి



చింతపల్లి విద్యార్థినులకు బహుమతి ఇస్తున్న ఓఎస్డీ దయాకర్, ఐటీడీఏ పీవో రాణి మందలు



ద్వితీయ స్థానం పొందిన పాడేరు ఏకలవ్య మోడల్ స్కూల్ బాలికలు

సాక్షి,పాడేరు/చింతపల్లి రూరల్: నెల్లూరు జిల్లా కొడవలూరులో జరిగిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో చింతపల్లి పాఠశాల విద్యార్థులు ఫోక్ డాన్సులో ప్రథమ స్థానం సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులు జి.జాహ్నవి, ఎస్.ప్రియాంక, పి.భాగ్యశ్రీ, ఎస్.స్మైలీ, వి.స్వప్న, కె.లాస్య, కె.పవిత్ర, పి.ప్రాణేశ్వరి, వి.సలోమి, పి.మేరీలను పాఠశాల ప్రిన్సిపాల్ అన్నామణి అభినందించారు. పాడేరు ఏకలవ్య పాఠశాల బాలికలు థింసా నృత్యంలో ద్వితీయ స్థానం సాధించినట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ ఆదివారం విలేకరులకు తెలిపారు. 6,7 తరగతుల విద్యార్థినులు ధనలక్ష్మి, సునంద, సీహెచ్ భావన, పావని, సాయి, దీక్షిత, ప్రియాంక, వెంటలక్ష్మి, విశ్వప్రియ,అనూష, సీత బృందంగా ఏర్పడి థింసాతో పాటు పలు నృత్యాలు ప్రదర్శించారని చెప్పారు. వీరిని గురుకుల కార్యదర్శి హేమలత, ఇతర అధికారులు అభినందించి, ప్రశంసా పత్రాలు, ఇతర బహుమతులు అందజేశారు.

క్లుప్తంగా

మంత్రి రోజాను కలిసిన ఎమ్మెల్యే పాల్గుణ



మంత్రి ఆర్‌కే రోజాతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి ,పాడేరు : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్‌కే రోజాను విశాఖలో ఆదివారం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మర్యాదపూర్వకంగా కలిశారు. అరకు నియోజకవర్గ పరిధిలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, ఇతర ప్రాజెక్టులు తదితర విషయాలను మంత్రి రోజా దృష్టికి తీసుకువెళ్లారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



ఎస్ఈబీ ఎస్ఐ దాస్

అనంతగిరి: దాసరితోటలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ దాస్ ఆదివారం పర్యటించారు. గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ సారా, గంజాయి నిర్మూలనకు గిరిజనులు సహకరించాలని కోరారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వం యువతకు అన్ని రంగాల్లో అవకాశం కల్పిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో ఇసుక, మద్యం, గంజాయి, సారా, గుట్కా, మత్తు పదార్థాల రవాణా జరిగితే 14500 టోల్ ఫ్రీ నంబర్ సమాచారం అందించాలని సూచించారు.

ఆపదలో ఆదుకోవడం మానవ ధర్మం



ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వీఆర్ పురం: వరద బాధితులకు నిమ్మగుడెం ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ అందించిన సేవలు మరవలేనివని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాచర్ల గంగులు అన్నారు. వీఆర్ పురం చర్చిలో ఆదివారం జమాల్‌ఖాన్‌ను వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గంగులు మాట్లాడుతూ వరదల సమయంలో నాలుగు విలీన మండల్లో వేలాది మంది వరద బాధితులకు జమాల్‌ఖాన్ నిత్యావసర సరకులు అందించారని కొనియాడారు. అనంతరం జమాల్‌ఖాన్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఉన్నదానిలో కొంత దానం చేసి ఆదుకోవడం మానవ కనీస ధర్మమన్నారు. సర్ఫ్‌రాజ్ అలీ, సూఫీ, రహీమ్, వివిధ పార్టీల నాయకులు నరసింహరావు, ప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో క్రీడాభివృద్ధికి కృషి



ఎన్నికకు తరలివచ్చిన పీడీ, పీఈటీలు

కొయ్యూరు: మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాల-1లో అల్లూరి జిల్లా ఫిజికల్ డైరెక్టర్లు(పీడీ) ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు(పీఈటీ)ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అల్లూరి జిల్లాలోని 22 మండలాల నుంచి 196 మంది హాజరయ్యారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్నికల అధికారిగా వెంకటనాయుడు, మన్యం జిల్లా చీఫ్ కో-ఆర్డినేటర్ ఎం.వాసుదేవరావు పరిశీలకులకుగా విచ్చేసి ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా పాంగి సింహాచలం(పీడీ పాడేరు డివిజన్), రంపచోడవరం డివిజన్ నుంచి బాలరాజును ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు.అనంతరం వారు మాట్లాడుతూ ఏజెన్సీలో క్రీడాభివృద్ధికి నిర్ణయించారు. గిరిజన విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్ది రాష్ట్రస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. కొయ్యూరు సీఏహెచ్ పాఠశాల పీడీ నూకరాజు, జిల్లా స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సింహాచలం ఎన్నికల నిర్వాహణకు సహకరించారు. మన్యం జిల్లా, అల్లూరి జిల్లాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వాసుదేవరావు, పాంగి సూరిబాబులను సన్మానించారు. పోతురాజు, మహిళా కార్యదర్శిగా కిల్లు సుధారాణి, కోశాధికారిగా కె.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా భూపతిరాజుతో పాటు 25 మందితో కార్యవర్గం ఏర్పాటు చేశారు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

పాడేరు రూరల్: పాడేరు మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. సంఘం అధ్యక్షుడు నానిపాత్రుడు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అన్ని మండలాల్లో మండల కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి భవిష్యత్‌లో చేపట్టనున్న అంశాలపై చర్చించారు.

మార్పు.. కొత్త రూపు

- సంక్షేమ వసతి గృహాలకు కార్పొరేట్ లుక్
- రూ.3 కోట్లతో జోలాపుట్టులో హాస్టల్ నిర్మాణం
- తీరనున్న వసతి సమస్య
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



జోలాపుట్టులో ఆధునిక హంగులతో నిర్మితమవుతున్న హాస్టల్

ముంచంగిపుట్టు: సరైన భవనం లేక బాలికలు స్కూల్ కాంప్లెక్స్ భవనంలోనే చదువులు కొనసాగించారు. వసతి సమస్యతో కాలం వెళ్లదీస్తూ వచ్చారు. గత పాలకులు సమస్య తెలిసినా పట్టించుకునే వారే కరువు. ఆ సమస్యలన్నీ ప్రభుత్వం చొరవతో తొలగిపోతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాడు-నేడుతో విద్యార్థుల సమస్యలు తొలగుతున్నాయి. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లిష్ మీడియం బాలికల పాఠశాలకు ప్రభుత్వం నాడు-నేడు ద్వారా ట్రైబల్ వెల్ఫేర్ శాఖ నుంచి ఎడ్యుకేషనల్ ఇన్‌స్ట్రక్చర్ నిధులు రూ.3.35కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో పాఠశాల సమీపంలో గత ఏడాదిగా వసతి గృహం(హాస్టల్) పనులు ఆ శాఖ అధికారులు పర్యవేక్షణలో జోరుగా జరిగాయి. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆశ్రమ పాఠశాలలో 394మంది విద్యార్థినులు అభ్యసిస్తున్నారు. అత్యాధునిక సౌకర్యాలతో పెద్దపెద్ద గదులు, మరుగుదోడ్లు, నిరంతరం నీటి సరఫరా, ఏకకాలంలో ఒకేసారి వెయ్యి మంది విద్యార్థులు భోజనం చేసే విధంగా డైనింగ్ హాల్‌లను అధికారులు చూడముచ్చటగా నిర్మించారు. ప్రస్తుతం ఈ డార్మెంటరీ పనులు 90శాతం పూర్తి అయ్యాయి.మరో నెల రోజుల్లో డార్మెంటరీలో మిగిలి ఉన్న విద్యుత్ పనులు,పెయింటింగ్ పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు ఇంత మెరుగైన మౌలిక సదుపాయాలతో డార్మెంటరీ భవనం నిర్మించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు వసతులను చూసి ఆశ్చర్యానికి గురవుతున్నారు.నాడు నేడు ద్వారా ప్రభుత్వం పాఠశాలలకు కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధునాతన సదుపాయాలతో హాస్టల్

ప్రభుత్వం నాడు-నేడు ద్వారా కల్పిస్తున్న నిధులతో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న వసతి గృహాలతో బాలికల వసతి సమస్య పూర్తిగా తీరుతుంది. ప్రభుత్వం విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు హర్షణీయం.

– బి.కమల,
ఎంపీటీసీ సభ్యురాలు,
జోలాపుట్టు

జోలాపుట్టు ఇంగ్లిష్ మీడియం

ఆశ్రమ పాఠశాలలో హాస్టల్ నిర్మాణం 90శాతం పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.3.35కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో భవన నిర్మాణ పనులు జరిగాయి. వైరింగ్, పెయింటింగ్ తదితర చిన్న చిన్న పనులు ఉన్నాయి. నెల రోజుల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్టర్‌కు ఆదేశాలు సైతం జారీ చేసాము..

– జబ్బార్,
ట్రైబల్ వెల్ఫేర్ ఏఈఈ,
ముంచంగిపుట్టు

వైఎస్సార్ చేయూతతో ఆర్థిక భరోసా



కొయ్యూరులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్, తదితరులు

కొయ్యూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూతతో పేద కుటుంబ మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతుందని డొనూరు సర్పంచ్ పాట్టిక భవానీ, మండల బూత్ కమిటీ కన్వీనర్ పాట్టిక పోతురాజు అన్నారు. మండల కేంద్రంలో వైఎస్సార్ చేయూత లబ్ధిదారుల సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మహిళలందరూ కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ చేయూత సొమ్ముతో స్వయం ఉపాధి పొంది జీవనం సాగిస్తామన్నారు. సురేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు

హుకుంపేట : మండలంలోని గూడ పంచాయతీ కోడెలి గ్రామంలో వైఎస్సార్ చేయూత పథకం లబ్ధిదారులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. థ్యాంక్యూ సీఎం సార్.. జై జగనన్న అంటూ నినాదాలు చేశారు. సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



హుకుంపేటలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



కొయ్యూరు కొండపై వెలసిన దుర్గమ్మ ఆలయం



పాడేరులోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

సాక్షి, పాడేరు /కొయ్యూరు/ చింతపల్లి/గంగవరం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామాల్లోని దుర్గమ్మ ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. నేటి నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో కొయ్యూరులోని

కొండపై ఉన్న కనకదుర్గ ఆలయం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ఆలయాన్ని మరో ఇంద్రకీలాద్రిగా భావిస్తారు. శరన్నవరాత్రుల సందర్భంగా పలు గ్రామాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి దుర్గాదేవిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా భవానీ మాలధారులు ఇరుముళ్లను ఇక్కడ అమ్మకు సమర్పిస్తారు. సోమవారం నుంచి ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీ ఏర్పాట్లు చేసింది.

వృద్ధులు కొండపైకి రాలేకపోవడంతో కిందన కూడా తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.దీంతో కొందరు భక్తులు అక్కడ అమ్మవారికి పూజలు చేస్తారు. పాడేరు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో నేటి నుంచి నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

సినిమాహాల్ సెంటర్‌లో కనకదుర్గమ్మతల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. చింతపల్లి, గంగవరం మండలాలతో అన్ని ప్రాంతాల్లో నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

మోదమ్మకు ప్రత్యేక పూజలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భవానీ మాలధారులు

సాక్షి, పాడేరు : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మైదాన ప్రాంతాల్లో భవానీ మాలధారణ చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని మోదకొండమ్మతల్లికి పూజలు చేశారు. అలాగే పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాలు ఆలయం వద్ద కూడా భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణశాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, ఇతర పూజలు నిర్వహించారు. పాడేరుకు చెందిన బిక్కవోలు రాంబాబు, కల్లూరు గోవింద్‌లు తమ పితృదేవతల పేరుతో ఆదివారం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్ పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడులు దాతలను అభినందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటరత్నం,రామారావు, కొండలరావు, కొండబాబు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నాడు-నేడుతో పాఠశాలలకు మహర్దశ



పాఠశాలలో బోరు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సుభద్ర, ఎంపీటీసీ నాగమణి, ఇతర నేతలు



బలడ పాఠశాలలో బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

గూడెంకొత్తవీధి : అద్దెరవీధిలోని ఎంపీపీ పాఠశాలలో నాడు-నేడు ద్వారా చేపడుతున్న పలు పనులను సర్పంచ్ కొర్రా సుభద్ర, ఎంపీటీసీ సభ్యురాలు పి.నాగమణి ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు-నేడు ద్వారా ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చేకూరుతుందన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, త్వరితగతిన గడవు లోగా పూర్తిచేయాలని కోరారు. జి.కె.వీధి-2 ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు అరుణ్‌కుమార్, నూకరాజు, అప్పన్న, మోహన్, ఉపాధ్యాయుడు కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: జర్జుల పంచాయతీ బలడ గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో నాడు-నేడు ద్వారా చేపట్టనున్న బోరు నిర్మాణ పనులను విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పెద్దతమ్మెంగుల, గుర్రలబయలు, బొదిలిగూడ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పర్యటించి గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి పనులపై స్థానికులతో సమీక్షించారు. రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు, కుళాయిల సమస్యల పరిష్కారంపై తీర్మానం చేశారు. నాయకులు పద్మరావు, రాంప్రసాద్, అప్పారావు, జగన్నాథం, పెదబాబు, రాంబాబు, చందర్‌రావు, ఉపాధ్యాయులు చిన్నిగున్ని పడాల్, బొడ్రారాజు తదితరులు పాల్గొన్నారు.

కాఫీ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



చుట్టుమెట్ట గ్రామంలో కాఫీ ప్లాంటేషన్ కాఫీ మొక్కలు నాటుతున్న సురేష్‌కుమార్

పెదబయలు: ప్రభుత్వం గిరిజన రైతులు ఆర్థికంగా బలోపేతం చేయడానికి పెద్ద ఎత్తున కృషి చేస్తోందని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని చుట్టుమెట్ట గ్రామంలో రైతులు కాఫీ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలో 23 గ్రామ పంచాయతీల పరిధిలో 2022-2023 సంవత్సరంలో 1000 ఎకరాల్లో కొత్త కాఫీ ప్లాంటేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో చెట్టుమెట్ట గ్రామంలో కొర్రా సత్యారావు రైతు రెండు ఎకరాల కొత్త కాఫీ ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు ఇచ్చిన ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల స్థలంలో ఉద్యానవన పంటలు, కాఫీ, మిరియాల సాగు చేపడుతున్నామన్నారు. రైతులు ఉద్యానవన పంటలపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. ప్రస్తుత వాతావరణం ప్లాంటేషన్‌కు అనువుగా ఉందన్నారు. కాఫీ లైజన్‌వర్కర్లు రామలింగం, బాబూరావు, గాసన్న, పద్మనాభరాజు, శేషగిరిరావు, అర్జున్, గణపతిరావు, రైతులు పాల్గొన్నారు.

సేవతోనే సంపూర్ణ ఆనందం



లూథరన్ మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాస్టర్ సంజీవ్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న క్రైస్తవ కుటుంబాలు

అరకులోయ: మండల కేంద్రంలోని లూథరన్ మిషన్ వార్షికోత్సవాన్ని బెంజిపూర్‌లోని లూథరన్ ప్రార్థన మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా లూథరన్ మిషన్ వ్యవస్థాపకుడు పాస్టర్ రెవరెండ్ బి.ఇ.సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ సంస్థ తరపున ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంతాల్లో 29 ఏళ్లుగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. కోవిడ్ సమయంలో ఏజెన్సీ వ్యాప్తంగా గిరిజన గ్రామాల్లో విస్తృత సేవలందించామని, రోజూ నిత్యావసర సరకుల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు.

రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ప్రజా సేవతో సంపూర్ణ ఆనందం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా సంజీవ్‌కుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. సంఘ పెద్దలు కార్తికో, శాంతిభూషణ్‌రాజు,డొంబుధర్, లెనిన్‌రాజు, ప్రేమ్‌పాత్రో, గుండు మాస్టర్, విజయ నిర్మల, సుజాత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రంజిత్‌కుమార్

పాడేరు రూరల్ : పాడేరు పట్టణంలోని ఆర్టీసీ కాంపెక్స్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై ఎస్ఐ రంజిత్‌కుమార్ ఆదివారం అవగాహన కల్పించారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని, ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న వారిని, మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారిని ఎస్ఐ రంజిత్‌కుమార్ ప్రత్యేక కౌన్సిలింగ్ చేపట్టారు. వాహనాదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనాలు పాటించాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపవద్దని, మద్యం మత్తులో వాహనాలు నడవొద్దని అవగాహన కల్పించారు. వాహన చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

25ఆర్‌సీపీఎం192-420010 వీఆర్‌పురంలో వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై దుర్గాప్రసాద్

వీఆర్ పురం: వాహనచోదకులు తప్పనిసరిగా రహదారి నియమాలు పాటించాలని ఎస్ఐ తెల్లం దుర్గాప్రసాద్ అన్నారు. వీఆర్ పురంలో ఆదివారం రహదారి భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్ఐ ఎ.రాధాకృష్ణ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల ప్రారంభానికి చర్యలు



జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతిను కలిసిన రహదారి కాంట్రాక్టర్

రాజవొమ్మంగి: జె.అన్నవరం (వయా గొంటువాని పాలెం) నుంచి మైదాన ప్రాంతం ఏలేశ్వరం వరకు గల 10.81 కిలోమీటర్ల బీటీ రహదారి పనులు త్వరలో ప్రారంభిస్తామని సంబంధిత కాంట్రాక్టర్ వెల్లడించారు. ఈ మేరకు రోడ్డు పనులకు టెండర్ పొందిన సుధాకర్ ఇన్‌ఫ్రాకు చెందిన కాంట్రాక్టర్ ఆదివారం జడ్డంగిలోని జెడ్పీటీసీ ఒడుగుల జ్యోతిని ఆమె నివాశంలో కలిశారు. ఇటీవల కాకినాడలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో జెడ్పీటీసీ జ్యోతి రహదారి సమస్యను జెడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ మేరకు సదరు కాంట్రాక్టర్ ఆమెను కలిసి రోడ్డు పనులను 15 రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటునామన్నారు. రూ. 22.43 కోట్ల అంచనా వ్యయంతో రూపుదిద్దుకోనున్న ఈ రోడ్డు పూర్తయితే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వై. రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, కొయ్యూరు మండలాల ప్రజలకు రవాణా కష్టాలు తీరనున్నట్టు జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం



వై.రామవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్



జడ్డంగిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ షరీఫ్



గిరిజనులకు ఆన్‌లైన్ మోసాలను వివరిస్తున్న కొయ్యూరు ఎస్ఐ

కొయ్యూరు: ఆన్‌లైన్ మోసాలు, రుణ యాప్‌లు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు గ్రామాల్లో పర్యటించి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా కొయ్యూరు సంతలో ఎస్ఐ రాజారావు మాట్లాడుతూ రుణయాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దన్నారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడిన వారు 1930 నంబర్‌కు సమాచారం అందజేయాలన్నారు.

వె.రామవరం: యార్లగడ్డ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆదివారం సందర్శించారు. విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలు, యాప్‌ల డౌన్‌లోడు చేసుకోవద్దని సూచించారు.

రాజవొమ్మంగి: జడ్డంగి వారపు సంతలో ఎస్ఐ షరీఫ్ స్థానికులకు ఆన్‌లైన్ మోసాలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని సూచించారు. వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

వీఆర్వోల మండల కమిటీ ఎన్నిక

ఎటపాక: మండల వీఆర్వోల కమిటీ ఎన్నిక ఆదివారం ఎటపాకలో జరిగింది. అధ్యక్షులుగా జె.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కె.ఇందిరాకుమారి, కోశాధికారిగా పి.సావిత్రి,ప్రచార కార్యదర్శిగా ఎం.ధర్మరాజును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా మరో ఏడుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

త్రుటిలో తప్పిన అగ్ని ప్రమాదం

రాజవొమ్మంగి: మండలంలోని మొల్లిమెట్ల గ్రామానికి చెందిన ఎల్లెం సత్యనారాయణ వంటపాక ఆదివారం అగ్ని ప్రమాదానికి గురైంది. స్థానికులు మంటలు వ్యాప్తి చెందకుండా అదుపులోకి తీసుకున్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈదురుగాలులకు పాకపై ఉన్న టార్పాలిన్ పొయ్యి మీద పడడంతో ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెప్పారు.

కొయ్యూరులో 28న గడప గడపకు

కొయ్యూరు: మండల కేంద్రంలో ఈనెల 28న వైఎస్సార్ చేయూత కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మేరీరోజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి హాజరుకానున్నట్టు తెలిపారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 29, 30న కూడా రాజేంద్రపాలెం, కొయ్యూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొవాలని తెలిపారు.

నేడు గ్రామాల్లో గడప గడపకు

వై.రామవరం: పి.యర్రగొండ గ్రామ సచివాలయ పరిధిలోని కోకితగొంది, పి.యర్రగొండ తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మీ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పారదర్శకంగా పోస్టుల భర్తీ

అరకులోయ రూరల్: అంగన్‌వాడీ గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ పారదర్శకంగా జరపాలని అంగన్‌వాడీ వర్కర్లు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగమ్మ అన్నారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పోస్టుల భర్తీలో రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలని అధికారులను కోరారు. సభ్యులు లక్ష్మీ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు వైద్య శిబిరాలు

మారేడుమిల్లి: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల ఆవరణలో సోమవారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. రాజమహేంద్రవరంలోని మాగ్నా ఆస్పత్రి, గౌతమి నేత్రాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిబిరంలో స్త్రీ, ప్రసూతి, చిన్న పిల్లలు, కంటి, జనరల్ కేసులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు.

రేపు రాజవొమ్మంగిలో..

రాజవొమ్మంగి: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్యశ్రీ జనరల్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీదుర్గ తెలిపారు. రాజమహేంద్రవరంలోని జూపిటర్ ఆస్పత్రి, హెలీయాస్ హాస్పిటల్ వైద్య నిపుణులు రోగులను పరీక్షించి చికిత్స అందజేస్తారన్నారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు, మెరుగైన చికిత్స, ఉచితంగా మందులు అందజేయనున్నట్టు తెలిపారు. లాగరాయి, రాజవొమ్మంగి, జడ్డంగి మెడికల్ ఆఫీసర్లు, ఆరోగ్యమిత్రలు రమాదేవి, సౌజన్య, రాజబాబు, నాయుడు కార్యక్రమాలను పర్యవేక్షిస్తారన్నారు. అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.